
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
గురువారం 8 ఫిబ్రవరి 2024





ఆశీర్వదించండి.. ప్లీజ్!

సొంత నియోజకవర్గంలో సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తిని ఎదుర్కొంటున్న రోజా, వ్యూహాత్మక ఓట్ల వేటాట మొదలు పెట్టారు. కులసంఘాలను కూడగట్టుకునే పనిలో మునిగితేలుతున్నారు. వాళ్లను ఇంటికి పిలిచి విందు పెట్టి, అక్షింతలు చేతికిచ్చి ఆశీర్వదించమని సినిమా స్టయిల్‌లో కోరుతున్నారని ప్రచారం జరుగుతోంది. పుత్తూరు శివాలయం వీధిలో చందాలు వేసుకుని నిర్మించుకున్న బలిజ సంఘం భవనాన్ని ఏడు నెలల క్రితం దేవదాయశాఖ అధికారులు రాత్రికి రాత్రి కూలగొట్టేయడంతో ఆ వర్గం తీవ్ర అసహనంతో ఉంది. వీరిని బుజ్జగించేందుకు ఆ వర్గంతో సమావేశం ఏర్పాటు చేసి, పుత్తూరు గోవిందమ్మ గుంటలో భవన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, భూమిపూజను కూడా చేసేశారు. తన సొంత ఖర్చులతో పుత్తూరు నడిబొడ్డున శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని కూడా వాగ్దానం చేశారు. రెండు రోజుల క్రితం విజయపురం మండలం నుంచి క్షత్రియ సామాజిక వర్గ నాయకులను సైతం ఆహ్వానించి వారికి చేసిన మేళ్లను వివరించారని తెలిసింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయపురం ఎంపీపీగా లక్ష్మీపతిరాజుకు అవకాశం దక్కకుండా చేశారనే కోపం ఈ వర్గంలో ఇప్పటికీ ఉంది. అలాగే నగరి, పుత్తూరు మున్సిపాలిటీల్లో బలమైన సామాజికవర్గం అయిన మొదలియార్లను ప్రసన్నం చేసుకునేందుకు సైతం పడరానిపాట్లు పడుతున్నారు.ఆ సామాజికవర్గంలో ఆర్థికంగా బలమైన వ్యక్తులను పరామర్శల పేరుతో నగరిలోని వారి ఇళ్లకు వెళ్లి మద్దతు కోరిన రోజా... ఇటీవల ఇంటికి ఆహ్వానించి వారి చేతిలో అక్షింతలు పెట్టి మరీ తనను మళ్లీ ఆశీర్వదించాలని సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించినట్లు చెబుతున్నారు. అయితే, ఆ సామాజికవర్గానికి ప్రధాన జీవనాధారమైన పవర్‌లూమ్స్ పరిశ్రమకు ప్రభుత్వం తరఫున ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదనే అసంతృప్తి వారిలో గూడుకట్టుకొని ఉంది. బ్రాహ్మణ సంఘం నాయకులను కూడా ఇలాగే ఆహ్వానించి మద్దతు కోరారని చెబుతున్నారు. రోజా ఇంటికి వెళ్లి అక్షింతలు వేసివచ్చిన ఒక నాయకుడిని పలకరిస్తే, 'నీ పిచ్చిగాని భయ్యా ఈ రోజుల్లో కుల సంఘం నాయకులు చెపితే ఆ సామాజికవర్గం మొత్తం ఓట్లు వేసేస్తారని ఎలా అనుకుంటావు' అని తేల్చేశాడు.

-పుత్తూరు అర్బన్

జీనియస్ కిడ్ హాద్విక్‌సాయి

పెద్దపంజాణి, ఫిబ్రవరి 7: పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్టు.. రెండేళ్ల చిన్నారి హాద్విక్‌సాయి వరల్డ్ రికార్డులలో స్థానం సంపాదించాడు. పెద్దపంజాణి మండలం నిడిగుంటలోని శైలజ, యువరాజు దంపతుల రెండో కుమారుడు హాద్విక్‌సాయి. రెండేళ్ల వయసులోనే ఇతడు అద్భుతమైన జ్ఞాపకశక్తితో అందరినీ అబ్బురపరుస్తున్నాడు. గత నెలలో ఢిల్లీకి సంబంధించి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్.. చెన్నైకి చెందిన కలామ్స్ వరల్డ్ రికార్డ్ సంస్థ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ దేశాల జాతీయ పతాకాలను, జాతీయ, రాష్ట్రీయ పక్షులను, జంతువులను, పండ్లు, కూరగాయలు, వాహనాలు, మానవశరీర అవయవాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను గుర్తించడం, ఏది అడిగినా వెంటనే సమాధానం చెప్పాడు. దీంతో ఎక్స్‌ట్రార్డినరీ గ్రాస్పింగ్ పవర్ జీనియస్ కిడ్.. అచీవర్ అవార్డులను అందుకున్నాడు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో ఇతడి పేరు నమోదుతో పాటు కలాం వరల్డ్ రికార్డు నిర్వాహకులు ప్రశంసాపత్రం, పతకాలను అందించారు.




వరల్డ్ రికార్డు సృష్టించిన చిన్నారి హాద్విక్‌సాయి

'సిద్ధం' సభకు స్కూల్ బస్సులు పంపాల్సిందే!

లేకపోతే చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 7: 'సిద్ధం' సభకు ప్రైవేటు పాఠశాలల బస్సులు పంపాలని, లేకపోతే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ అధికారులు హెచ్చరించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో రవాణాశాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈనెల 11న అనంతపురంలో సీఎం జగన్ నిర్వహించనున్న సిద్ధం సభకు జిల్లా నుంచి భారీసంఖ్యలో జనసమీకరణ చేయడానికి ప్రైవేటు పాఠశాలల బస్సులను పంపాలని ఆదేశించారు. అంత దూరానికి పాఠశాల బస్సులను పంపలేమని కొందరు సమాధానమిచ్చారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం పాఠశాల బస్సులను రాజకీయ పార్టీల సమావేశాలకు పంపకూడదనే అంశాన్నీ ప్రస్తావించారు. అయినా, బస్సులను పంపాల్సిందేనని, పాఠశాలలో ఎన్ని బస్సులున్నాయో అన్నిటినీ తప్పనిసరిగా పంపాలని అధికారులు చెప్పారు. లేనిపక్షంలో విద్యాశాఖ, రవాణాశాఖ అధికారులు పాఠశాలల తనిఖీలకు వస్తారని హెచ్చరించారు.తమ సొంత వివాహాలకు, శుభకార్యాలకు పాఠశాల బస్సులను వినియోగించుకుంటే అపరాధ రుసుం రాసే రవాణాశాఖ అధికారులు..అనంతపురంలో జరిగే రాజకీయ సమావేశానికి బస్సులను పంపాలని బెదిరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. శనివారం సాయంత్రంలోపు పాఠశాలల బస్సులను రవాణాశాఖ అధికారులకు అప్పగించాలని హుకుం జారీ చేయడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ప్రైవేటు స్కూళ్ల యాజమానులు ఉన్నారు.



మెజారిటీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు ఖరారు

జనసేన నుంచీ స్పష్టత లేక మూడు చోట్ల పెండింగ్

మరో మూడు స్థానాల్లో తుదిదశలో కసరత్తు

ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కొత్తగా తిరుపతి పరిధిలోకి చేరిన మొత్తం 17 అసెంబ్లీ స్థానాలకు గానూ మెజారిటీ నియోజకవర్గాలకు టీడీపీ అభ్యర్థులు ఖరారయ్యారు. ఇంచుమించు 11 సెగ్మెంట్లలో అభ్యర్థుల విషయంలో అధిష్ఠానానికి స్పష్టత వచ్చింది. స్పష్టత వున్న చోట్ల అభ్యర్థులు ఎన్నికలకు సన్నద్ధం కావడంతో పాటు ఎన్నికల ప్రచారమూ మొదలు పెట్టేశారు. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక జరగాల్సివుంది. ఇందులో మూడు స్థానాలకు సంబంధించి మిత్రపక్షమైన జనసేనతో కలసి నిర్ణయం తీసుకోవాల్సి వున్నందున వాటిని పెండింగులో వుంచారు. చివరగా మిగిలిన మూడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక తుది దశకు చేరుకుంది. మొత్తంమీద మూడింట రెండొంతుల సెగ్మెంట్లలో అభ్యర్థుల విషయంలో స్పష్టత వున్నందున ప్రచార కార్యకలాపాలు జోరందుకున్నాయి.

తిరుపతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా తిరుపతి జిల్లా ఆవిర్భావంతో నెల్లూరు నుంచీ మూడు నియోజకవర్గాలు చేరాయి. దీంతో ఈ 17 నియోజకవర్గాలకు గానూ 11 చోట్ల అభ్యర్థుల విషయమై పార్టీ అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చేసింది. కుప్పంలో అధినేత పోటీలో వుంటారనేది చెప్పక్కర్లేదు. అక్కడ పార్టీ యంత్రాంగం ఎన్నికలకు సన్నద్ధమవుతూ ఏ స్థాయి నాయకులు ఆ స్థాయిలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అలాగే పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డి అభ్యర్థిత్వం పైనా ఎవరికీ అనుమానాల్లేవు. పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డి, పీలేరులో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని ఇదివరకే అధినేత, యువనేత ఇద్దరూ పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. పూతలపట్టులో మురళీమోహన్, జీడీనెల్లూరులో డాక్టర్ థామస్ ఇంఛార్జులుగా వున్నారు. నగరిలో గాలి భానుప్రకాష్, చంద్రగిరిలో పులివర్తి నాని, శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్ అభ్యర్థిత్వాలపైనా సందేహాలకు తావు లేదు. వీరి గెలుపుకోసం యువనేత లోకేశ్ యువగళం పాదయాత్రలో పిలుపిచ్చారు. గూడూరులో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అభ్యర్థిత్వాలు కూడా ఖరారైనట్టే. ఏవైనా అనూహ్య పరిణామాలు తలెత్తితే తప్ప ఈ నియోజకవర్గాల్లో మార్పుచేర్పులకు అవకాశం లేదు. ఈ 11 చోట్ల అభ్యర్థులను అధికారికంగా ప్రకటించడమే మిగిలివుంది. దీనికి తగ్గట్టు ఈ నియోజకవర్గాల్లో దాదాపుగా ఎన్నికల ప్రచారం మొదలైపోయింది. ఇంచార్జులుగా గ్రామాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. పార్టీ కార్యాలయాలు ప్రారంభించడం, వైసీపీలో అసంతృప్తితో వున్న నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకోవడం వంటి పనుల్లో బిజీగా వున్నారు.

తంబళ్లపల్లి, సత్యవేడు, సూళ్ళూరుపేటల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రధాన దృష్టి

చిత్తూరు, మదనపల్లె, తంబళ్ళపల్లె,తిరుపతి, సత్యవేడు, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక ఇంకా పెండింగులో వుంది. వీటిలో తంబళ్ళపల్లె, సత్యవేడు, సూళ్ళూరుపేటలపై ప్రస్తుతానికి ప్రధానంగా దృష్టి సారించింది. తంబళ్ళపల్లెకు మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ ఇంఛార్జిగా వున్నారు. ఆయన నివాసం, వ్యాపారాలు బెంగళూరులో వున్న సంగతి తెలిసిందే. అడపాదడపా నియోజకవర్గానికి వచ్చి వెళుతున్నారని, పూర్తిస్థాయి రాజకీయాలు చేయడం లేదని అధిష్ఠానానికి ఫీడ్ బ్యాక్ వుంది. అక్కడ మంత్రి పెద్దిరెడ్డి సోదరుడు ద్వారకనాథరెడ్డిని ఓడించడానికి తీవ్రంగా శ్రమించాల్సి వుందని, దానికోసం పూర్తి సమయం కేటాయించాలని అధినేత ఎన్నిసార్లు హెచ్చరించినా శంకర్ దానికనుగుణంగా పనిచేయడం లేదని సమాచారం. రెడ్ల ఆధిపత్యం, ప్రాబల్యం కలిగిన నియోజకవర్గం కావడంతో మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ తనయుడు, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌కుమార్ రెడ్డిని బరిలోకి దింపే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. అయితే దీనిపై రెండేళ్ళుగా ప్రచారమే తప్ప ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ప్రవీణ్ రాకపై శ్రేణుల్లో నమ్మకం, ఆసక్తి కూడా సన్నగిల్లుతున్నాయి. ఈలోపు ఆర్థిక పరిపుష్టి కలిగిన ఒకరిద్దరు ఆశావహులు తెరపైకి వచ్చారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో బీసీలకు కనీసం ఒక సీటైనా ఇవ్వాలన్న డిమాండ్ ఆ వర్గాల నుంచీ వినిపిస్తున్న నేపథ్యంలో పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి వుంది. సత్యవేడు విషయానికొస్తే మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ ఇంఛార్జిగా వున్నారు. పార్టీకి కంచుకోట వంటి ఈ నియోజకవర్గంలో స్థిరమైన నాయకత్వం మాత్రం లేదు. దీంతో ప్రతి ఎన్నికల్లోనూ అభ్యర్థి ఎంపిక ప్రహసనంగా మారుతోంది. ఇక్కడ టికెట్ కోసం ఇంచార్జి హెలెన్ గట్టిగా పోరాడుతుండగా రేసులో గత ఎన్నికల అభ్యర్థి జేడీ రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య పేర్లు కూడా వినిపిస్తున్నాయి. టికెట్ ఎవరికనే విషయమై ఇంకా స్పష్టత రాలేదు. సూళ్ళూరుపేటలో మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం ఇంఛార్జిగా వున్నారు. మాజీ మంత్రి పరసా రత్నం, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి భర్త కృష్ణయ్య తదితరుల పేర్లు కూడా టికెట్ రేసులో వినిపిస్తున్నాయి. ఈ మూడు స్థానాలపైనే ఇపుడు అధిష్ఠానం ఎక్కువ ఫోకస్ పెట్టింది.వారం పదిరోజుల్లో ఈ స్థానాలపై పార్టీ ఓ నిర్ణయం తీసుకునే అవకాశముంది.

మూడు స్థానాల్లో ఎంపికపై ప్రతిష్టంభన

తిరుపతి, చిత్తూరు, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలిజ సామాజికవర్గం ఓటర్లు అధికంగా వున్నందున వీటిలో మూడూ గానీ లేదా రెండు గానీ మిత్రపక్షమైన జనసేన పార్టీ కోరుతోంది. అయితే మూడు చోట్లా వేర్వేరు కారణాలతో జనసేనకు కేటాయించే పరిస్థితులు కనిపించడం లేదు. ఉదాహరణకు తిరుపతి స్థానం తీసుకుంటే ఇక్కడ జనసేనకు బలమైన అభ్యర్థులు అందుబాటులో లేరు. టీడీపీలో మాత్రం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్ వంటివారు టికెట్ తమకేనని ధీమాగా వున్నారు. చిత్తూరులోనూ జనసేనకు తగిన అభ్యర్థులు దొరకని పరిస్థితి. అయితే డీకే ఆదికేశవులు మనవరాలు చైతన్య ఆ పార్టీ టికెట్ కోసం యత్నిస్తున్నట్టు సమాచారం.ఇక్కడ టీడీపీ టికెట్‌కు మాత్రం తీవ్ర పోటీ వుంది. రేసులో శ్రీరామనేని చంద్రప్రకాష్, గురజాల జగన్మోహన్, కటారి హేమలత తదితరుల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. మదనపల్లెలో జనసేనకు గంగారపు రామ్‌దాస్‌చౌదరి వంటి చెప్పుకోదగ్గ నాయకులు అందుబాటులో వున్నారు.అదే సమయంలో మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్,షాజహాన్ బాషా టీడీపీ టికెట్ కోసం గట్టిగా యత్నిస్తున్నారు. జనసేనకు కేటాయించే సీట్లపై ఇంకా స్పష్టత రానందున తిరుపతి, మదనపల్లె, చిత్తూరు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రతిష్టంభన నెలకొంటోంది.

ఎంపీ స్థానాలపైనా కొనసాగుతున్న సస్పెన్స్


ఈ 17 అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన తిరుపతి, చిత్తూరు, రాజంపేట ఎంపీ స్థానాల్లో కూడా టీడీపీ అభ్యర్థుల ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోంది. తిరుపతి నుంచీ ఎంపీ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అంగలకుర్తి నీహారికను అధిష్ఠానం దాదాపు ఖరారు చేసింది. అయితే ఈలోపు ఆ సీటును జనసేన కోరినట్టు సమాచారం. దీంతో ఇక్కడ అభ్యర్థి ఎంపిక పెండింగులో పడింది. కాకపోతే జనసేన పార్టీకి కేటాయించడానికి అభ్యర్థి ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. బలమైన అభ్యర్థిని ప్రతిపాదించే పక్షంలో సీటు కేటాయించేందుకు టీడీపీ అధిష్ఠానం సుముఖంగా వున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చిత్తూరు రిజర్వుడు స్థానానికి కూడా అభ్యర్థి విషయంలో టీడీపీ ఒక అభిప్రాయానికి రాలేదు. పలువురు ప్రధాన మంత్రుల వద్ద భద్రతాధికారిగా పనిచేసిన రిటైర్డు పోలీసు అధికారి వీసీ స్వామి వంటి వారు రేసులో వున్నారు. రాజంపేట సీటు కోసం ప్రధానంగా అన్నమయ్య జిల్లా నుంచే ఆశావహులు రేసులో వున్నారు. మొత్తానికీ ఈ మూడు ఎంపీ స్థానాలతో పాటు తంబళ్లపల్లె, మదనపల్లె, సత్యవేడు, సూళ్ళూరుపేట, చిత్తూరు, తిరుపతి తదితర ఆరు అసెంబ్లీ సీట్లపై వారం పదిరోజుల్లో పూర్తి స్థాయి స్పష్టత రానుంది.

డబుల్ ఎంట్రీ ఓటర్లు లేరు

● కొత్తగా ఓటు నమోదుకు స్కూల్ సర్టిఫికెట్ తప్పనిసరన్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 7: జిల్లాలో డబుల్ ఎంట్రీ ఓటర్లు లేరని కలెక్టరు షన్మోహన్ చెప్పారు. దీనిని నిర్ధారిస్తూ బీఎల్వోలు కూడా లేఖలు ఇచ్చారన్నారు. డీఆర్వో రాజశేఖర్‌తో కలిసి బుధవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. మృతిచెందిన ఓటర్ల వివరాలపై మరోసారి బీఎల్వోల ద్వారా ఇంటింటి సర్వే చేపట్టినట్లు వివరించారు. ఇంతవరకు 93శాతం ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం జరిగిందని చెప్పారు. నామినేషన్లు వేసేవరకు ఫారం-6 ద్వారా కొత్తగా ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. కొత్తగా ఓటు నమోదుకు ఆధార్‌తోపాటు పాటు స్కూల్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా అందజేయాలన్నారు. బుధవారం నుంచి కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్ అధ్యక్షతన ఓటర్ల జాబితా పరిశీలనకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని చెప్పారు. పార్టీల ప్రతినిధులు భాస్కర్, పరదేశి (కాంగ్రెస్), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), గంగరాజు (సీపీఎం), సురేంద్రకుమార్ (టీడీపీ), ఉదయ్‌కుమార్ (వైసీపీ), పి.భాస్కర్ (బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

ఇదిగో డబుల్ ఎంట్రీలు


665
GMC1700467
ఓటరు పేరు : యస్.వేణుగోపాల్ శెట్టి
తండ్రి పేరు: లక్ష్మీనారాయణ
ఇంటి సంఖ్య : 2-71
వయస్సు : 55 లింగము : పు

728
TVF1045633
ఓటరు పేరు : వేణుగోపాల సత్రాసల
తండ్రి పేరు: లక్ష్మీనారాయణ చెట్టి సత్రాసల
ఇంటి సంఖ్య : 3-113
వయస్సు : 63 లింగము : పు

ఎస్ వేణుగోపాల్‌శెట్టిగా.. మరో చోట వేణుగోపాల సత్రాసల పేరిట ఉన్న ఓట్లు

చౌడేపల్లె, ఫిబ్రవరి7: ఇప్పటికీ ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు కొనసాగుతున్నాయి. చౌడేపల్లె మండలం 101వ పోలింగ్ కేంద్రంలోని ఓటర్ల జాబితా సీరియల్ నెంబరు 665లో జీఎంసీ 1700467లో ఎస్ వేణుగోపాల్‌శెట్టి, తండ్రి పేరు లక్ష్మీనారాయణ, ఇంటి సంఖ్య 2-71, వయసు 55 ఏళ్లుగా ఓటు ఉంది. మరో చోట సీరియల్ నెంబరు 728లో టీవీఎఫ్ 1045633లో వేణుగోపాల సత్రాసల, తండ్రి పేరు లక్ష్మీనారాయణ చెట్టి సత్రాసల, ఇంటి సంఖ్య 3-113, వయసు 63గా మరో ఓటు ఉంది. అలాగే, సీరియల్ నెంబరు 678లో పెద్దన్న కుమారుడిగా కడియాల చెంగల్రాయులు గాను, మరో చోట సీరియల్ నెంబరు 788లో పెద్దన్న నాయుడు కుమారుడిగా చెంగల్రాయులు కడియాల గాను ఓట్లున్నాయి. ఇలా ఇంటి పేరును వెనుకా, ముందు పెట్టి రెండు ఓట్లు ఇచ్చారు.


వర్తికుప్పం వద్ద కాలువలో నీళ్లు కనిపించేలా అడ్డుకట్ట వేశారిలా..

ఏదో అనుకుంటే.. ఇంకేదో అయిందే..!

● కుప్పానికి హంద్రీ నీవా జలాలపై వైసీపీలో అంతర్మథనం ● టీడీపీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వైనం

రామకుప్పం, ఫిబ్రవరి 7: 'కుప్పానికి హంద్రీ-నీవా నీళ్లు తెచ్చేశాం. అన్ని చెరువులు నింపేస్తాం' అంటూ సభలు, సోషల్ మీడియాలో వైసీపీ నేతలు ఊదరగొట్టారు. నాలుగున్నరేళ్లుగా కాలువ పనులను గాలికి వదిలేసి.. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో నీళ్లు ఇచ్చేశామని చెప్పుకోవడానికి తాపత్రయపడ్డారు. అరకొర పనులతో నీటిని తీసుకొచ్చి.. రాజకీయ ప్రయోజనం పొందాలని భావించారు. వైసీపీ నేతలు ఇలా అనుకుంటే.. అది మరోలా అయింది.

వైసీపీ అధికారంలోకి రాగానే కుప్పం నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించింది. 2018లో సీఎంగా చంద్రబాబు వివిధ అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసిన రూ.1400కోట్లను నిలుపుదల చేసింది. నియోజకవర్గానికి హంద్రీ నీవా నీటిని తీసుకొచ్చేందుకు టీడీపీ హయాంలో 80 శాతానికిపైగా కాలువ పనులు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేయలేదు. ఈ క్రమంలో ఏడాదిన్నర కిందట కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం జగన్ ఆరు నెలల్లో హంద్రీ నీవా నీటిని తీసుకొస్తామని ప్రకటించారు. ఆ తర్వాత కూడా పనులు చేపట్టలేదు. ఎన్నికల వేళ చంద్రబాబు నియోజకవర్గానికి తాము నీటిని ఇచ్చామని చెప్పుకొనేందుకు రెండు, మూడు నెలలుగా ఆగమేఘాల మీద కాలువ పనులు చేపట్టారు. అరకొర పనులు చేసి గత నెల 14న వి.కోట మండలం ఆదినపల్లె లిఫ్ట్ పాయింట్ నుంచి కుప్పం వైపు పంపింగ్ పారంభించారు. రామకుప్పం మండలం వర్తికుప్పం సమీపానికి ఈ నీళ్లు చేరగానే.. అక్కడ సభ నిర్వహించారు. సీఎం జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, త్వరలో ఆయనే కుప్పానికి వచ్చి ఈ విషయం చెబుతారన్నారు. అప్పట్నుంచి జలాలు రామకుప్పం మండలాన్ని దాటి ముందుకు సాగలేదు. ఆదినపల్లె నుంచి లిఫ్టుల ద్వారా జలాలు ఆగి, ఆగి వస్తుండటంతో వర్తికుప్పానికి వచ్చేసరికే ఇంకిపోయి, కాలువల్లో తక్కువ నీళ్లు కనిపిస్తున్నాయి. దీంతో వైసీపీ నేతలు, శ్రేణులు అంతర్మథనంలో పడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో 5న జరగాల్సిన సీఎం జగన్ పర్యటన రద్దయింది.

ఈ ప్రశ్నలకు జవాబులేవీ?

కుప్పానికి హంద్రీ-నీవా జలాలు తీసుకురావడంపై సోషల్ మీడియా వేదికగా టీడీపీ ప్రశ్నల పరంపర సంధిస్తోంది. అసలు వర్తికుప్పానికి చేరిన జలాలు ఎక్కడినుంచి వచ్చాయని టీడీపీ శ్రేణులు ప్రశ్నించాయి. కాలువల ద్వారా జలాలతో చెరువులను నింపడం చూశామని, ప్రస్తుతం కుప్పానికి జలాలు వచ్చిన తీరును చూస్తే చెరువల నుంచి జలాలను కాలువలోకి పంపినట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశాయి. కృష్ణా నదిలో జలాలు లేని పరిస్థితిలో కుప్పం వరకు నీళ్లు ఎలా వచ్చాయని కూడా టీడీపీ శ్రేణులు ప్రస్తావించాయి. పుంగనూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులోని జలాలను హంద్రీ-నీవా కాలువకు మళ్లించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాయి. సాధారణంగా సోషల్ మీడియాలో టీడీపీ శ్రేణుల పోస్టులపై అంతెత్తున స్పందించే వైసీపీ శ్రేణులు.. ఈ విషయంలో ఏమీ చెప్పలేని పరిస్థితిలో పడ్డాయి.

బాధలు తీరాలంటే టీడీపీకి పట్టం కట్టాలి



కరపత్రాలు పంచుతున్న మురళీమోహన్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 7: ప్రజల బాధలు తీరాలంటే ఓటు అనే ఆయుధంతో టీడీపీకి పట్టం కట్టాలని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని తంబుగానిపల్లె పంచాయతీ కొత్తవెంకటాపురంలో మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికీ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీ కల్లుగీత మాజీ డైరెక్టర్ మహేంద్ర, మాజీ ఎంపీటీసీ లోకనాధం నాయుడు, నాయకులు హరిప్రసాద్, గోపాల్ నాయుడు, లోకనాధం నాయుడు, అరుణ్, సుబ్రహ్మణ్యం నాయుడు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముద్దుకృష్ణమ హయాంలోనే అభివృద్ధి



ముద్దుకృష్ణమ నాయుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 7: నగరి టవర్‌క్లాక్ వద్ద మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడి 6వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ముద్దుకృష్ణమ చిత్రపటానికి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. భానుప్రకాష్ మాట్లాడుతూ నగరిలో తన తండ్రి ముద్దుకృష్ణమ నాయుడు చేసిన అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయేగాని వైసీపీ హయాంలో ఎలాంటి అభివృద్ధి కనిపించలేదన్నారు. ఆయన అడుగుజాడలలో నడిచి, ఎల్లవేళలా పేదలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చినబాబు, శివకుమార్‌రెడ్డి, గుణశేఖర్, కృష్ణారెడ్డి, రుక్కుం బాలాజీ, టీఎన్‌టీయూసీ బాలాజీ, సురేష్ నాయుడు, రాష్ట్ర టీడీపీ మహిళా అధికారప్రతినిధి మీరా, నారాయణస్వామి నాయుడు, పురుషోత్తం నాయుడు, శ్రీనివాసన్, వాసు కన్నయ్య, ఆర్ముగం కర్ణ, నాయకులు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్, విజయపురం, మహారాజపురంలో ముద్దుకృష్ణమ నాయుడి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాలి భానుప్రకాష్ పాల్గొని అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నేతలు చినబాబు, బాలసుబ్రహ్మణ్యంరాజు, ధనుంజయయాదవ్, గుణభూషణమ్మ, పురుషోత్తం, శివలింగం, దశరథరాజు, మహేంద్రన్, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: ముద్దుకృష్ణమ నాయుడి వర్ధంతి కార్యక్రమం నింద్రలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గాలి భానుప్రకాష్ పాల్గొని, ముద్దుకృష్ణమ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నింద్ర మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు

విజయపురం, ఫిబ్రవరి 7: మండలంలోని మహారాజపురంలో నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్ సమక్షంలో ఆరుగురు వైసీపీ కార్యకర్తలు పార్టీ కండువా వేసుకొని తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామంలో టీడీపీ విజయానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, నాయకులు గంజి మాధవయ్య, డి.సుబ్రహ్మణ్యంరాజు, పురుషోత్తం, వెంకటేసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఐరాల విద్యార్థి



క్రీడాకారుడు వంశీకృష్ణతో హెచ్‌ఎం, పీడీ

ఐరాల, ఫిబ్రవరి 7: జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి వంశీకృష్ణ ఎంపికైనట్లు హెచ్‌ఎం కోమల బుధవారం తెలిపారు. ఇటీవల అన్నమయ్య జిల్లా సుండుపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో వంశీకృష్ణ మంచి ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 20వతేదీ నుంచి 25వతేదీ వరకు బీహార్‌రాష్ట్రం పాట్నాలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు. క్రీడాకారుడిని చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధనయాదవ్, కార్యదర్శి రమేష్, పీడీ దేవా అభినందించారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



గ్రానైట్ బండపైనే రక్తదానం చేస్తున్న ప్రయాణికుడు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 7: ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పీవో షహజద్ తెలిపారు. ఈ శిబిరంలో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ శిబిరాన్ని ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లో ఏర్పాటు చేయడంతో బెడ్లు లేక గ్రానైట్ బండపైనే పడుకొని రక్తం ఇవ్వాల్సిరావడంతో రక్తదాతలు ఇబ్బంది పడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

తవణంపల్లె, ఫిబ్రవరి 7: తవణంపల్లెలోని అన్న క్యాంటీన్‌లో బుధవారం మండలంలోని తెల్లగుండ్లపల్లెకు చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్ నాయుడు సహకారంతో అన్నదానం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్‌కుమార్, నాయకులు మణి టైలర్, సుభాష్, వేలు, నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మృతిచెందిన రంజిత్‌కుమార్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 7: జీవితంపై విరక్తి చెందిన రంజిత్ కుమార్ (25) అనే యువకుడు ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మకాలనీలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. రంజిత్‌కుమార్ పెయింటింగ్ పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. ఇతడికి భార్య, కుమారుడు ఉన్నారు. రంజిత్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం



టీబీ కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ రవిరాజు

నింద్ర, ఫిబ్రవరి 7: టీబీ రహిత సమాజంగా చేయటమే మన లక్ష్యమని చిత్తూరు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. బుధవారం నింద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి 14 మంది టీబీ రోగులకు ఉచితంగా పోషకాహార కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ టీబీ జబ్బు ట్యూబర్ క్యూల్ బ్యాక్టీరియా వల్ల వస్తుందని, ఈ జబ్బు కలిగిన వ్యక్తి దగ్గినపుడు, తుమ్మినప్పుడు ఆరోగ్యవంతమైన వ్యక్తి పీల్చితే ఈ వ్యాధి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సుమలత, వైద్య సిబ్బంది గోపీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు



గుట్టపై వ్యాపిస్తున్న మంటలు

కార్వేటినగరం, ఫిబ్రవరి 7: కార్వేటినగరం సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న గుట్టకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ప్రతి ఏటా వేసవి రాగానే అటవీ ప్రాంతాల్లోనికి వెళ్లే పశువులు, మేకల కాపర్లు ఇలా అడవికి నిప్పు పెట్టడం జరుగుతోంది. కార్వేటినగరం అటవీ శాఖ అధికారులు అడవికి నిప్పు పెట్టే దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పంపిణీకి యూరియా సిద్ధం

కార్వేటినగరం, ఫిబ్రవరి 7: మండలంలోని రైతులకు పంపిణీ చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో యూరియా సిద్ధంగా ఉందని మండల వ్యవసాయ అధికారిణి హేమలత తెలిపారు. అన్నూరు 450, కొల్లగుంట 150, గోపిశెట్టిపల్లి 10, ఆర్‌కేవీబీపేట 79, అమ్మపల్లి 300, డీఎం పురానికి 130, కత్తెరపల్లికి 120 యూరియా బ్యాగులతో పాటు కాంప్లెక్స్ ఎరువు 60 బ్యాగులు సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి ఎరువులు తీసుకోవచ్చునని ఏవో తెలిపారు.

బదిలీ అయిన ఎస్‌ఐకి సన్మానం



శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 7: ఎస్‌ఆర్‌పురం మండలం ఎస్‌ఐ షేక్షావలి సేవలు మరువలేనివని కార్వేటినగరం సీఐ సత్తిబాబు అన్నారు. ఎస్‌ఆర్‌పురం మండలం నుంచి బదిలీపై చిత్తూరు వన్‌టౌన్‌కి వెళ్లిన ఎస్‌ఐ షేక్షావలిని బుధవారం పోలీసుస్టేషన్‌లో కార్వేటినగరం సీఐ సత్తిబాబు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వరులు, సిబ్బంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం ఎస్‌ఐగా మల్లికార్జున

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 7: బంగారుపాళ్యం ఎస్‌ఐగా మల్లికార్జున బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు వన్‌టౌన్ నుంచి బదిలీపై బంగారుపాళ్యం ఎస్‌ఐగా వచ్చారు. శాంతిభద్రతలు కాపాడేందుకు తనవంతు కృషిచేస్తానని, ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోను సన్మానిస్తున్న వైద్యులు

పూతలపట్టు, ఫిబ్రవరి 7: పూతలపట్టు ఎంపీడీవోగా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ప్రసన్నకుమారిని స్థానిక వైద్యాధికారులు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో దుశ్శాలువలతో సన్మానించారు. పూతలపట్టు వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ప్రమీల, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులు కూడా ఆమెను సన్మానించారు.

మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్‌ను అందచేస్తున్న రమణి, దేవకి

యాదమరి, ఫిబ్రవరి 7: మండలంలోని కోనాపల్లె పాఠశాలకు చిత్తూరు రామ్‌నగర్‌కాలనీకి చెందిన దేవిక, రమణి సంయుక్తంగా బుధవారం పోర్టబుల్ మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచ్చారి, ఎంఈవో రుక్మిణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కార్వేటినగరం, ఫిబ్రవరి 7: మండలంలో ఈనెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్య, వైద్య, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఈ డొక్కు బస్సుతో ఏగలేము..!



మొరాయించిన పెద్దిశెట్టిపల్లి ఆర్టీసీ బస్సు

గుడిపాల, ఫిబ్రవరి 7: చిత్తూరు-పెద్దిశెట్టిపల్లికి వెళ్లే ఆర్టీసీ బస్సు ఎప్పుడు పడితే అప్పుడు మొరాయించడంతో మారుమూల ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం చిత్తూరు నుంచి పెద్దిశెట్టిపల్లికి వెళ్తుండగా మార్గమధ్యమైన గంగాసాగరం వద్ద టైరు పగిలిపోవడంతో పాటు మొరాయించడంతో అందులో ప్రయాణిస్తున్న గ్రామస్థులు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మంచి కండీషన్‌లో ఉండే బస్సులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్

- ఆందోళనలో ప్రజలు



కార్వేటినగరం, ఫిబ్రవరి 7: సీడీ కండ్రిగ గ్రామ పంచాయతీ పరిధిలో కోదండ రామాపురంలో తక్కువ ఎత్తులో నేలమీద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా ఆ దారిన రాకపోకలు సాగించే ప్రజలు భయందోళన వ్యక్తంచేస్తున్నారు. రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెతో పాటు ఎక్కువ ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికే

విద్యుత్ అదాలత్



వినియోగదారులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

పెనుమూరు, ఫిబ్రవరి 7: వినియోగదారుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ చైర్మన్ ఎనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. బుధవారం పెనుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆంజనేయమూర్తి అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సింగిల్ ఫేస్ లైన్లను ఏర్పాటు చేయాలని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సకాలంలో ఇవ్వాలని రైతులు కోరారు. ఈఈ పద్మనాభపిళ్లై మాట్లాడుతూ వినియోగదారులు టోల్‌ఫ్రీ నెంబరు 1902 కు కాల్ చేసి తమ సమస్యను తెలపవచ్చని తెలిపారు. ఇది 24 గంటలు అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ సభ్యులు రామమోహన్‌రావు, టెక్నికల్ సభ్యులు అంజనికుమార్, కన్స్యూమర్ అఫైర్స్ సభ్యులు ఈశ్వరమ్మ, డీఇ జ్ఞానేశ్వర్‌రావు, ఏఇ నీరజ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో విజ్ఞానసుధ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విజ్ఞానసుధ విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 7: స్థానిక విజ్ఞానసుధలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో తమ కళాశాలకు చెందిన 216 మంది విద్యార్థులు ప్రతిభతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ శ్రీధర్ తెలిపారు. బహుళజాతి కంపెనీలతో బుధవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో తమ కళాశాలలో ఫైనల్ ఇయర్ డిగ్రీ చదువుతున్న 216 మంది విద్యార్థులు వార్షిక వేతనం రూ.2.25 లక్షల నుంచి రూ.3.20 లక్షల వరకు ఇచ్చే వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

ఆశయ సాధనతోనే విజయం సాధించాలి



విజయం ఉత్తమ విద్యార్థులకు సత్కారం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 7: ఆశయం, పట్టుదల, క్రమశిక్షణతోనే ఇటు జీవితంలో, అటు సమాజంలో రాణించగలమని శ్రీభానోదయ స్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వర్‌రావు, గిరింపేట మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం రమేష్ పేర్కొన్నారు. విజయం జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవం బుధవారం స్థానిక ఓ ఫంక్షన్ హాలులో ఆ విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, డైరెక్టర్ శైలజామూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ విజయానికి కృషి, పట్టుదల, ఏకాగ్రత, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. తేజోమూర్తి, శైలజామూర్తి మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులకు బహుళజాతి కంపెనీల్లో పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడంతో దేశవిదేశాల్లో విజయం ప్రభంజనం సృష్టించిందని, ఇది తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థులు నైపుణ్యం మరింత పెంచుకుని వివిధ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఉత్తమ విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవరత్నం నాయుడు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీఆర్వో బాధ్యతల స్వీకరణ



డీఆర్వోకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న రెవెన్యూ ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 7: జిల్లాలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నూతన డీఆర్వోగా ఆయన ప్రస్తుత డీఆర్వో ఎస్. రాజశేఖర్ నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఫైలులో సంతకాలు చేశారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సూపరింటెండెంట్లు, సిబ్బంది నూతన డీఆర్వోకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. డీఆర్వో మాట్లాడుతూ కలెక్టర్, జేసీ వంటి ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తానన్నారు. గతంలో నంద్యాల, కర్నూలు జిల్లాల్లో డీఆర్వోగా పని చేసి, బదిలీపై చిత్తూరుకు వచ్చానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పి. వెంకటేశ్వరన్, భూపరిపాలనా శాఖ ఏవో ఎం. ప్రసాద్ బాబు, కలెక్టరేట్ మెజిస్టీరియల్ విభాగ సూపరింటెండెంట్ కె. గుణశేఖర్ రెడ్డి, ల్యాండ్ అక్విజేషన్ సూపరింటెండెంట్ వి. వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ యూనిట్ రెవిన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు పార్థసారథి, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపించండి

చిత్తూరు, ఫిబ్రవరి 7: పిల్లల ఆరోగ్యం కోసం ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తినిపించాలని మేయర్ అముద, కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. బుధవారం కమిషనర్ కార్యాలయంలో ఈనెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టనున్న కార్యక్రమాల గోడపత్రికలను డీఎంహెచ్‌వో ప్రభావతితో కలిసి ఆవిష్కరించారు. నగరపాలక పరిధిలోని పాఠశాలలు, కళాశాలలకు అవసరమైన మాత్రలను ఆయా హెచ్‌ఎంలకు, ప్రిన్సిపాల్స్‌కు పంపిణీ చేశారు. ఈ నెల 9వ తేది మధ్యాహ్నం భోజనం తరువాత విద్యార్థులకు తినిపించాలని కోరారు. అదేవిధంగా రెండు సంవత్సరాల లోపు పిల్లలకు అర్ధమాత్ర, 19 సంవత్సరాల్లోపు పిల్లలకు ఒక మాత్రను మింగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీకాంత్, కార్పొరేటర్లు శ్రీకాంత్, సహదేవన్, ఏసీ గోవర్ధన్, ఎంహెచ్‌వో లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

'రా.. కదలిరా' విజయవంతం పట్ల టీడీపీ హర్షం

పాలసముద్రం, ఫిబ్రవరి 7: గంగాధరనెల్లూరులో మంగళవారం నిర్వహించిన రా... కదలిరా సభ విజయవంతం కావడం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పాలసముద్రం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రసంగం పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచిందన్నారు. సమావేశానికి పాలసముద్రం మండల ప్రజలతో పాటు గంగాధరనెల్లూరు నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశ నిర్వహణకోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు ఎన్నికల వరకు నాయకులు, కార్యకర్తలు కృషి చేసి పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు వాసు నాయుడు, జె. విజయ్‌కుమార్, మోహన్ రెడ్డి, దాము రెడ్డి, శేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: గంగాధరనెల్లూరులో నిర్వహించిన రా... కదలిరా బహిరంగ సభకు గుడిపాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేసినందుకు అందరికీ రుణపడి ఉంటామని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, జీజేఎం ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెన్న కేశవులు నాయుడు, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు.

విజేతలుగా తిరిగిరండి: డీఆర్వో, జడ్పీ సీఈవో



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న అధికారులు

చిత్తూరు క్రీడలు, ఫిబ్రవరి 7: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా విశాఖపట్నంలో ఈ నెల 9వ తేదీన జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా తిరిగిరావాలని డీఆర్వో పుల్లయ్య, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి కోరారు. బుధవారం జిల్లా నుంచి విశాఖపట్నానికి బయలుదేరిన జిల్లా క్రీడాకారుల బస్సును అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్ పోటీల్లో 103 మంది మహిళా, పురుష క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని పోటీల్లో విజేతగా నిలిచి చిత్తూరు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రాజశేఖర్, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కమిటీ సమావేశం



సమావేశానికి హాజరైన సభ్యులు

చిత్తూరు, ఫిబ్రవరి 7: చిత్తూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం నగర మేయర్ అముద అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ అరుణ, కమిటీ సభ్యులు ఆర్. చంద్రశేఖర్, ఆర్‌జీ శ్రీకాంత్, సహదేవన్ పాల్గొనారు. సమావేశంలో కూరగాయల మార్కెట్, జంతువధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండ్‌లకు 2024-25 సంవత్సరానికి బహిరంగ వేలం నిర్వహించడానికి గెజిట్ నోటిఫికేషన్ విడుదలకు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండోలో కొత్త ఓటరు కార్డు కోసం రైతుల వివరాలు ఇవ్వండి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 7: గంగాధరనెల్లూరు సింగిల్‌విండో సొసైటీలో ఓటుహక్కు కలిగిన రైతులందరూ కొత్త ఓటర్‌కార్డు పొందేందుకు సంబంధించిన జిరాక్స్‌లను అందజేయాలని త్రీమెన్ కమిటీ చైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, సీఈవో విజయకుమార్‌రెడ్డి, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ బాబు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్, సూపర్‌వైజర్ విజయ ఓ పత్రికా ప్రకటనలో బుధవారం పిలుపునిచ్చారు. సొసైటీలో ఓటుహక్కు కలిగిన రైతులు, సభ్యులు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు, ఫోన్‌నెంబర్, పట్టాదారు పాసుపుస్తకం లేదంటే వన్‌బీ అడంగల్ కాపీ జిరాక్స్‌లను ఈనెల 12వతేదీలోపు సింగిల్ విండో ఆఫీస్‌లో చేర్చాలని కోరారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 7: మొదటి సారిగా ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లుకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీడీ తులసి తెలిపారు. బుధవారం స్థానిక పీవీకేఎన్, సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకునే యువతకు సిస్టమేటిక్ ఓటరు ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ డిజిటల్ ఓటింగ్‌కు సంబంధించి ఓటరు హెల్ప్ లైన్ యాప్ ద్వారా ఎలా రిజిస్టర్ చేసుకోవాలి, ఓటు ఉన్న వారు ఆ హక్కును ఎలా ఈవీఎంలో వినియోగించుకోవాలనే దానిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ సర్కిల్ వద్ద ఈవీఎం నమూనా ప్రదర్శన

చిత్తూరు, ఫిబ్రవరి 7: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని గాంధీ విగ్రహం వద్ద భారీ ఈవీఎంను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఏఆర్వో, కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ బృందాలు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఈవీఎం నమూనా ప్రదర్శనలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. ఓటర్లకు ఈవీఎం విధానంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఎన్నికల వరకు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఏసీపీ రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.